Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue): 327 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 7 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

# యుద్ధానికి సిద్ధమా.. తర్వాత పరిస్థితి ఏమిటి

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఈ రెండు దేశాల మధ్య యుద్ధం తప్పదనే వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైతే గెలుపు ఓటములు అనేవి తర్వాత సంగతి.. ముందుగా యుద్ధం చేయాలంటే భారీగా నిధులు కలిగి ఉండాలి. అది కూడా బిలియన్లు, ట్రిలియన్లలో నగదు ఉండాలి. మరి భారత్, పాకిస్థాన్ దేశాలకు అంత భారీగా నిధులు ఉన్నాయా? అదీ కాక యుద్ధాల వల్ల భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సైతం సంభవిస్తుంది. అలాగే భారీగా ఆయుధ సంపత్తి సైతం కలిగి ఉండి తీరాలన్నది సుస్పష్టం. అంతేకాదు.. ఈ యుద్ధం తర్వాత ఏ దేశమైనా మళ్లీ తిరిగి కోలుకోవాలంటే చాలా ఏళ్లు పడుతుంది. అది కూడా అంత ఆషామాషీ వ్యవహారం కాదన్న సంగతి అందరికీ తెలిసిందే.

**యుద్ధం ప్రారంభమే కాకూడదు..**

ఇక యుద్ధం అనేది ప్రారంభమే కాకూడదు. ఓ వేళ ప్రారంభమైతే.. దానిని ఆపే శక్తి ఆ యుద్ధాన్ని ప్రారంభించిన ఆ దేశాల చేతుల్లో ఉండదన్న విషయం కూడా విధితమే. అందుకు గత చరిత్రలోనే కాదు.. ప్రస్తుతం రష్యా, ఉక్రెయిన్ల మధ్య జరుగుతోన్న యుద్ధాన్ని పరిశీలిస్తే పరిస్థితులు ఇట్టే బోధపడ తాయి. దాదాపు 1990లో ఓ సంస్థ సర్వే ప్రకారం పాకిస్థాన్‌తో సుమారు 1000 గంటల పాటు భారత్ యుద్ధం చేస్తే.. అందుకు రూ. 27 వేల కోట్లు ఖర్చువుతుందని ఓ అంచనా. దాదాపు 4 దశాబ్దాల క్రితం జరిగిన తర్వాత ఈ సర్వేను పరిశీలిస్తే.. ప్రస్తుతం ఇదే సమయంలో పాక్‌తో యుద్ధానికి దిగితే భారత్‌కు అయ్యే ఖర్చు విలువ దాదాపు కొన్ని వందల రెట్లు పెరిగే అవకాశముంది. నాడు యుద్ధ ఖర్చు వేల కోట్లలో ఉంటే.. నేడు అది లక్షల కోట్లలోకి ఎగబాకిందన్నది సుస్పష్టం. అలాగే పాకిస్థాన్‌కు సైతం దాదాపుగా ఇదే రీతిలో




ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కానుంది.

**ఆ రంగానికే భారీగా నిధులు..**

అలాగే ప్రతి ఏటా బడ్జెట్ కేటాయింపుల్లో రక్షణ రంగానికి భారీగా కేంద్రం నిధులు కేటాయిస్తుందన్న సంగతి అందరికీ తెలిసిందే. గతేడాది అంటే.. 2024-25 మధ్య రక్షణ రంగానికి రూ. 6.21 లక్షల కోట్లు కేటాయించింది. ఒకవేళ యుద్ధం జరిగితే మాత్రం ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుదన్నది ఎవరు కాదనలేని సత్యం. ఇక భారత్‌లో విదేశీ మారక నిల్వలు సైతం రూ.681.15 బిలియన్ డాలర్లు ఉన్నాయి. ఇవి కూడా యుద్ధ అగ్నిగుండంలో సమిధి కాక తప్పదనే వాదన కూడా వినిపిస్తోంది.

**ఒక వేళ యుద్ధం జరిగితే మాత్రం..**

ఈ యుద్ధం కారణంగా రెండు దేశాల్లోని దాదాపు అన్ని రంగాలపై పన్నులు విధించే అవకాశముంది. ఇది సామాన్యుడిపై సైతం భారం పడే అవకాశముంది. ఇది ప్రపంచ మార్కెట్‌లో భారత్ తయారు చేసే ఉత్పత్తులపై పడే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్‌లో జీఎస్టీ పేరిట ప్రతి దానిపై పన్ను పోటు తప్పడం లేదు. ఇక యుద్ధం జరిగితే మాత్రం పన్ను పోటు అలా ఇలా కాదు.. ఓ రేంజ్‌లో ఉంటుందనే వాదన ఉంది. అలాగే సబ్సిడీ మీద ప్రభుత్వం పలు పథకాలను అందిస్తోంది. వీటికి సైతం దాదాపుగా కోత పడే అవకాశముంది. అలాగే రుణాల కోసం అంతర్జాతీయ ద్రవ్య నిధులతోపాటు ప్రపంచ బ్యాంకుల ముందు ఈ దేశాలు మోకరిల్లే పరిస్థితి ఏర్పడుతోంది.

**వార్ ట్యాక్స్ అంటే..**

యుద్ధం అంటేనే విపత్కర పరిస్థితుల్లో చోటు చేసుకుంటుంది. సాధారణ సమయంలో ప్రజలపై పన్నులను ప్రభుత్వం విధిస్తోంది. కానీ యుద్ధం జరిగితే మరిన్ని నిధులు ప్రభుత్వానికి అత్యవసరమవుతాయి. అలాంటి వేళ.. వార్ ట్యాక్స్‌ను ప్రభుత్వం విధిస్తుంది. అది కూడా ఎందుకంటే.. ఇంకా సోదాహరణగా చెప్పాలంటే.. సైనికులు కోసం.. యుద్ధ సామాగ్రి కోసం, వారికి ఆహారం అందించడం కోసం, సైనికులను తరలించేం దుకు తదితర అంశాలు చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం. అందుకు భారీగా నిధులు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వార్ ట్యాక్స్ విధించే అవకాశముంది.

**ఇప్పటికే పరిస్థితి దారుణం..**

ఇప్పటికే భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇరుదేశాలూ పలు ఆంక్షలు విధించుకున్నాయి. అందులో భాగంగా ఇరు దేశాలు తమ గగనతలంలో ప్రత్యర్థి దేశాల విమాన రాకపోకలపై నిషేధం విధించుకున్నాయి. ఈ కార ణంగా భారత్ నుంచి యూరప్, బ్రిటన్, ఉత్తర అమెరికా దేశాలకు వెళ్లే విమానాలు.. పాక్ గగనతలం నుంచి కాకుండా.. మరో మార్గం ద్వారా పయనిస్తున్నాయి. ఈ విధంగా నిషేధం విధించిన కొద్ది రోజులకే ఇరు దేశాల విమానయాన సంస్థలకు బిలియన్ల డాలర్ల మేర నష్టం వాటిల్లిన సంగతి అందరికీ తెలిసిందే. ఆయా విమానాల దూరాభారం పెరగడం, అధిక సమయం ప్రయాణించడంతోపాటు విమానయాన సంస్థలకు అదనపు సిబ్బందిని ఉద్యోగాల్లోకి తీసుకోవాల్సి ఉంది. తద్వారా ఏడాదికి రూ. 6 వందల మిలియన్ల మేర ఖర్చవుతోందని అంచనా వేస్తున్నారు.

**ఒక్కటి కాదు.. అన్ని రంగాలకు దెబ్బే..**

మరోవైపు గతంలో పాక్‌తో చేసుకున్న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది. ఈ సింధు జలాలతోపాటు దాని ఉపనదుల నీటిని సైతం పాక్‌లో పంటల సాగుకు వినియోగిస్తారు. ఈ నీరు ఆ దేశానికి వెళ్లకపోవడంతో.. ఆ దేశంలో పంట భూములు ఏడారిగా మారే అవకాశముంది. యుద్ధం జరిగితే.. అది కాశ్మీర్ పర్యటకంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కాశ్మీర్ పర్యాటకంపై వేలాది కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నాయి. అవి సైతం కోల్పోయే పరిస్థితి ఏర్పడనుంది. దీంతో రాష్ట్రంలో ఆదాయం భారీగా తగ్గనుంది. ఏదీ ఏమైనా యుద్ధం జరిగితే మాత్రం.. ఆ ప్రభావం ప్రజలపై పన్నుల రూపంలో నడ్డి విరచనున్నాయన్నది ఎవరి కాదనలేని సత్యం. ఎందుకంటే.. యద్ధంలో గెలిచినా.. ఓడినా ఆ ప్రభావం ఆ దేశ ప్రజలపై ఏదో రూపంలో ప్రభావం చూపనున్నదన్నది సుస్పష్టం.

**ఆ దిశగా భారత్ చర్యలు..**

ఇక యుద్ధం ప్రారంభించడం కంటే.. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశం తాలుకా ఆర్థిక మూలాలపై వేటు పడేలా చర్యలు తీసుకోవాలి. అలా అయితేనే ఆ దేశం తాలుకా ఉగ్ర వాద కోరలను పీకినట్లవుతోంది. ఆ దిశలోనే భారత్ వ్యూహాత్మ కంగా అడుగులు వేస్తోంది. అందులోభాగంగానే.. ఇప్పటికే సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. పాక్ విమానాలను భారత్ గగనతలంలోకి రాకుండా అడ్డుకొంది. అలాగే అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి నిధులు సరఫరా ఆగిపోయేలా భారత్ అడుగులు వేస్తోంది.

# ఆ శాఖలో ఉద్యోగాల భర్తీకి సీఎం గ్రీన్ సిగ్నల్




**అమరావతి, (రాజధాని వార్తలు):** దేవాదాయ శాఖలో ఉద్యోగాల భర్తీకి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దేవాదాయ శాఖలో 137 ఉద్యోగాల భర్తీకి సీఎం చంద్ర బాబు నాయుడు ఆమోదం తెలిపారు. మంగళ వారం అమరావతిలో దేవాదాయ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ సహా గ్రేడ్ 1, 3 ఈవో పోస్టులు సైతం ఖాళీలు ఉన్నాయని.. ఈ నేపథ్యంలో ఆ శాఖలో పోస్టులు భర్తీకి సీఎం ఆమోద ముద్ర వేశారు. అలాగే మరో 200 వైదిక సిబ్బంది కొలువుల నియామకాలకు సైతం ఆయన అంగీకారం తెలిపారు. ఇక నూతనంగా 16 ఆలయాల్లో నిత్యాన్న దాన పథకం అమలు చేయా లని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అదేవిధంగా 23 ప్రధాన ఆలయాలకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా కార్యక్రమాలు చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. దేవాలయ భూముల్లో శాఖాహార హెూటళ్లకు మాత్రమే అనుమతి ఇచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. ఇక ఆగమశాస్త్రం ప్రకారమే ఆలయాల అభివృద్ధి పనులు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ రోజు జరిగిన ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితోపాటు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇక ఏప్రిల్ 30వ తేదీన చందనోత్సవం సందర్భంగా టికెట్లు కొనుగోలు చేసేందుకు క్యూ లైన్‌లో నిలిచిన భక్తులపై గోడ కూలిన సంఘటనలో 8 మంది భక్తులు మరణించారు. ఈ ఘటనపై ముగ్గురు సభ్యులతో కూడిన కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది. అందుకు సంబంధించిన నివేదికను సోమవారం సాయంత్రం అమరావతిలో సీఎం చంద్రబాబుకు కమిషన్ అందజేసింది. ఆ క్రమంలో ఈ ఘటనకు బాధ్యులుగా ఉన్న పర్యాటక, దేవాదాయ శాఖలోని పలువురు ఉన్నతాధికారులే కారణమని సదరు నివేదికలో కమిషన్ స్పష్టం చేసింది. వారిపై చర్యలు తీసుకో వాలని ప్రభుత్వానికి స్పష్టమైన సూచన చేసింది. ఈ నేపథ్యంలో ఈ రెండు శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే.

# ఈ నెల 15 నుంచి సరస్వతి పుష్కరాలు




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 15 తేదీ నుంచి 26వ తేదీ వరకూ సరస్వతి పుష్కరాలు జరగనున్నాయి. దీనిపై మంగళవారం సచివాలయంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ ముఖ్య అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ భేటీలో సీఎస్, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. జరగబోయే సరస్వతి పుష్కరాల్లో హెలికాప్టర్ ప్రయాణం అందుబాటులోకి రానుంది. పుష్కరాలకు వచ్చిన భక్తులు కాళేశ్వరం ఆలయం, పుష్కర ఘాట్‌లు, చుట్టూ ఉన్న పచ్చటి అందాలను గగనతలం నుంచి వీక్షించేలా రాష్ట్ర ప్రభుత్వం 'జాయ్‌రైడ్'ను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ఒకేసారి 6 గురు ప్రయాణించేందుకు వీలుగా ఎయిర్‌బస్ హెచ్-125 మోడల్ హెలికాప్టర్‌ను వినియోగించనుంది. టికెట్ ధరను ఒక్కొక్కరికీ రూ.4,500 చొప్పున ఖరారు చేయగా.. ప్రయాణ సమయాన్ని 6-7 నిమిషాలుగా నిర్ణయించారు. హెలికాప్టర్ ప్రయాణాలకు అవసరమైన సాంకేతిక అనుమతులు, ఇతరత్రా వ్యవహారాలు మొత్తం ఇప్పటికే పూర్తయ్యాయి. ఉదయం నుంచి సూర్యాస్తమయం వరకే జాయ్ రైడ్‌లను నిర్వహించనున్నారు. కాగా, ఈ హెలికాప్టర్ ప్రయాణాల బాధ్యతలను బెంగళూరుకు చెందిన ఓ సంస్థకు అప్పగించారు. జాయ్‌రైడ్‌లకు అవసరమైన సాంకేతిక అనుమతులను సదరు సంస్థే ఏర్పాటు చేసుకుంటుంది.

**సరస్వతి పుష్కరాలకు హెలీకాప్టర్ ఏర్పాటు..**

పుష్కర ఘాట్‌లకు దగ్గర్లోనే హెలికాప్టర్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ, పర్యాటక శాఖలతో పాటు సివిల్ ఏవియేషన్ విభాగం సంయుక్తంగా హెలికాప్టర్ ప్రయాణాలను పర్యవేక్షించనున్నాయి. గతంలో మేడారం జాతరలోనూ దేవా దాయ శాఖ హెలికాప్టర్ ప్రయాణాలను ఏర్పాటు చేసింది. అప్పుడు భక్తుల నుంచి మంచి ఆదరణ రావడంతో సరస్వతి పుష్కరాల్లోనూ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయిం చింది. కాగా, బెంగళూరు నుంచి కాళేశ్వరానికి మళ్లీ ఇక్కడి నుంచి అక్కడకు హెలికాప్టర్ ఖాళీగా వచ్చి, వెళ్లాల్సిన నేపథ్యంలో రూ.20 లక్షలను ప్రభుత్వం చెల్లించనుంది. అదేవిధంగా హెలిప్యాడ్‌కు దగ్గర్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక బృందాలను అందుబాటులో ఉంచనుంది. హెలికాప్టర్ ప్రయాణ బాధ్యతలను తీసుకున్న సంస్థ గతంలో 15 వేల మంది భక్తులకు జాయ్‌రైడ్‌లను అందించిందని వెల్లడించింది. టికెట్ల బుకింగ్ కోసం టోల్ ఫ్రీ నంబరును త్వరలో ప్రకటించనున్నట్టు అధికారిక వర్గాలు తెలిపాయి.

# గ్రూప్ -1 పరీక్షల మూల్యాంకనం కేసులో కీలక పురోగతి

**అమరావతి, (రాజధాని వార్తలు):** గ్రూప్-1 పరీక్షల మూల్యాంకనం కేసులో విజయవాడ పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఏపీపీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో కామ్ సైన్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్‌లలో ఒకరైన పమిడికాలువ మధుసూదన్ ఇంటిలో పోలీసులు సోదాలు చేశారు. మధుసూదన్‌ను పోలీసులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. మంగళవారం కూడా దర్యాప్తు కొనసాగుతోంది. మాన్యువల్ విధానం కాదని డిజిటల్ మూల్యాంకనం చేసి 1.14 కోట్ల రూపాయలు తీసుకున్న కామ్ సైన్ కంపెనీ డైరెక్టర్లలో మధుసూదన్ ఒకరు. డిజిటల్ మూల్యాంకనంకు వినియోగించిన ఎలెక్ట్రానిక్ పరికరాలు, ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మధుసూదన్‌ను పోలీసులు ఏ-2గా చేర్చారు. డిజిటల్ మూల్యాంకనం చేయమని మీకు ఎవరైనా చెప్పారా... లేక ప్రభుత్వంలో ఎవరితోనైనా సిఫార్సు చేయించుకున్నారా.. అని పోలీసులు ప్రశ్నించారు.

**వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలు..**

కాగా వైసీపీ హయాం నాటి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నియామకాల్లో జరిగిన అక్రమాలు వెలికితీస్తున్న విజయవాడ పోలీసులు కీలక ముందడుగు వేశారు. వైఎస్ అభిమాని, జగన్ సన్నిహితుడు 'కామ్‌సైన్' కంపెనీ డైరెక్టర్‌లలో ఒకరైన పమిడికాల్వ మధుసూదన్‌ను విజయవాడ పోలీసులు హైదరాబాద్‌లో సోమవారం సుదీర్ఘంగా ప్రశ్నించారు. వైఎస్ సహకారంతో మధుసూదన్ 2008లో 'కామ్‌సైన్' మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభించారు. కరోనా సమయంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 మూల్యాంకనం ఈ సంస్థ ఆధ్వర్యంలోనే నిర్వహించారు.

దీంతో ఈ కంపెనీని ఏ-2గా పేర్కొన్నారు. వాస్తవానికి మాన్యువల్ విధానాన్ని కాదని, డిజిటల్ మూల్యాంకనం చేసి రూ.1.14 కోట్లు తీసుకున్న కామ్‌సైన్ కంపెనీ డైరెక్టర్ హెూదాలో ఆయనపై కేసు నమోదైంది. గ్రూప్-1 మూల్యాంకనం అక్రమాల్లో అసలు సూత్రధారి అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనే యులు కాగా, రెండో నిందితుడిగా మధుసూదన్‌పై ఇటీవల సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్‌కు వెళ్లిన బెజవాడ పోలీసులు బంజారా హిల్స్‌లోని పంచవటి కాలనీలో ఉన్న కార్యాలయంలో మధుసూదన్‌ను ప్రశ్నించారు. అప్పట్లో ఏం జరిగింది.. ఏపీపీఎస్సీ కార్యాలయంలో కాకుండా ప్రైవేటు రిసార్ట్స్‌లో డిజిటల్ మూల్యాంకనం ఎందుకు చేశారు? అలా చేయమని పీఎస్ఆర్ ఆంజనేయులు చెప్పారా? ఏపీపీఎస్సీ నుంచి ఎవరైనా అడిగారా? మీరే ప్రభుత్వ పెద్దల నుంచి పైరవీ చేయించుకున్నారా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. అప్పట్లో డిజిటల్ మూల్యాంకనానికి వినియోగించిన ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

# ఏపీ లిక్కర్ స్కాంలో ఆ ముగ్గురు

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీ మద్యం కుంభకోణం కేసులో సిట్ అధికారులు మెమో వేశారు. లిక్కర్ స్కాం కేసులో ఏ 31గా ధనుంజయ రెడ్డి, ఏ 32 కృష్ణ మోహన్ రెడ్డి, ఏ 33 గోవిందప్ప బాలాజీలను చేర్చారు సిట్ అధికారులు. ఇటీవల అరెస్ట్ అయిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, చాణక్య రిమాండ్ రిపోర్ట్‌లో కూడా ఈ ముగ్గురు పేర్లను సిట్ అధికారులు ప్రస్తావించారు. ఈ ముగ్గురి ఆదేశాల మేరకు అప్పట్లో డబ్బులు వసూలు చేశామని, ఈ డబ్బులు వాళ్ల వద్దకు చేరాయని విచారణలో పేర్కొన్నారు నిందితులు. ఈ రిమాండ్ రిపోర్టు ఆధారంగానే వీళ్ల పేర్లు చేర్చినట్లు మెమోలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని నిన్న (సోమవారం) సుప్రీం కోర్టుకు ఈ ముగ్గురు వెళ్లిన విషయం తెలిసిందే. అయితే వీరికి అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ఏపీ హైకోర్టులోనే ఈ కేసును చేర్చుకోవాలని స్పష్టం చేసింది. ఏపీ హైకోర్టులో ఈ కేసుకు సంబంధించి తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డితో పాటు గోవిందప్ప పిటిషన్ దాఖలు చేశారు. ఈ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ వేసేందుకు సమయం కావాలని ప్రభుత్వం తరపు న్యాయవాది రెండు రోజుల



క్రితం కోరారు. అప్పటివరకు కూడా అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని ఈ ముగ్గురు హైకోర్టును అభ్యర్థించారు. కానీ హైకోర్టు అందుకు నిరాకరించింది. దీంతో ముగ్గురు సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. అక్కడ కూడా వీరికి నిరాశే ఎదురైంది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు నిరాకరించడంతో పాటు ఈ కేసులో జోక్యం చేసుకుందు కూడా నిరాకరించింది సుప్రీం ధర్మాసనం. దీంతో ఈ ముగ్గురు పేర్లను ఈ కేసులో చేర్చుతూ సిట్ మెమో దాఖలు చేసింది. ఈ మెమోను కోర్టు పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. కోర్టు ఈ మెమోను పరిగణలోకి తీసుకుంటే ఈ ముగ్గురిని ఏపీ లిక్కర్ స్కాంలో నిందితులుగా చేర్చినట్టు అవుతుంది.


# స్పోర్ట్స్ మెటీరియల్ అందజేత



**ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల బ్యూరో, (రాజధాని వార్తలు):** స్పోర్ట్స్ అథా రిటీ ఆఫ్ తెలంగాణ వారు జిల్లాలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సమ్మర్ క్యాప్స్‌కు స్పోర్ట్స్ మెటీరియల్ పంపటం జరిగింది. అందులో మంగళ వారం జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అట్టి స్పోర్ట్స్ మెటీరియల్ ను ఇనుగుర్తి క్యాంపుకు వాలీబాల్, గార్ల క్యాంపుకు బాస్కెట్ బాల్ స్పోర్ట్స్ మెటీరియల్ క్యాంప్ ఇంచార్జ్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడాధికారి జ్యోతి, క్యాంప్ ఇంచార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు, (రాజధాని వార్తలు):** తిరుమలలో వెలసిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మంగళవారం ఉదయం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కుటుంబ సభ్యులు, టీడీపీ నాయ కులు పాల్గొన్నారు.



# పొగాకు పంటను పరిశీలించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్






**పర్చూరు, (రాజధాని వార్తలు):** బాపట్ల జిల్లా పర్చూరు మండలం ఉప్పు టూరులో పొగాకు పంటను రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, రెవెన్యూ అధికారులు కలిసి పరిశీలించారు. ఉప్పుటూరులో పొగాకు రైతులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, బాపట్ల ఆర్డిఓ గ్లోరియాలు ముఖాముఖి నిర్వహించడం జరిగింది.


# యువజన కాంగ్రెస్ జమ్మికుంట మండల కార్యాలయాన్ని సందర్శించిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**జమ్మికుంట, (రాజధాని వార్తలు):** జమ్మికుంట పట్టణానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మరియు యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్ పట్టణంలోని వివాహ వేడుకకి హాజరయ్యారు. అనంతరం యువజన కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్ ఆహ్వానం మేరకు వారి యువజన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్ వారిని శాలువాతో సత్కరించి స్వాగతించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమారస్వామి, యువజన కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు చిన్నాల శ్రీకాంత్, యువజన కాంగ్రెస్ జమ్మికుంట మండల ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, కార్యదర్శులు వొల్లాల రవి, యేబూషి అజయ్, నాయకులు పచ్చిమట్ల భాను, వెంకటేష్, జావిద్, సల్మాన్, చిరంజీవి, సత్యనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# గంగా భవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన డాక్టర్ లక్ష్మి, దంపతులు





**దర్శి, (రాజధాని వార్తలు):** ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలో ఉన్న తాళ్లూరు మండలం, గుంటిగంగా భవాని అమ్మవారి దేవస్థానంలో దర్శి మండలం, రాజంపల్లి గ్రామ టిడిపి నాయకులు రావులపల్లి ఏడుకొండలు ఆహ్వానం మేరకు సభ్యులు అమ్మవారికి మొక్కులు తీర్చుకునే కార్యక్రమానికి దర్శి టీడీపీ ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్ దంపతులు ముఖ్య అతిదులుగా హాజరై గంగా భవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈ ఓ డా.లక్ష్మీ – డా. లలిత్ సాగర్‌లకు అమ్మవారి ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టి పాటి లక్ష్మీ మాట్లాడుతూ దేశంలోనే అమరావతి రాజధాని గొప్ప రాజధానిగా రూపుదిద్దు కుంటుందని అన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వ పాలనలో జగన్ రెడ్డి తన పరిపాలనతో ప్రజల రాజధాని అమరావతిని పూర్తిగా ధ్వంసం చేశారని మండిపడ్డారు. మాట తప్పను, మడమ తిప్పను అని చెప్పిన జగన్ రెడ్డి ఆంధ్రుల రాజధాని అమరావతి విషయంలో ఎందుకు మాట మార్చారాని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రజల అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. ప్రపంచానికి ధీటైన రాజధానిగా ప్రజల రాజధాని అమరావతి నిర్మాణాణం జరుగు తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాజధాని అమరావతి పునర్నిర్మాణం వేగంగా జరుగుతుందన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో రాజధాని అమరావతి అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. గడిచిన పది నెలల్లో సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకెళ్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృ ద్ధికి నోచుకోక రాష్ట్రం అల్లకల్లోలమైందన్నారు. ఈ కార్యక్రమంలో రావులపల్లి ఏడుకొండలు మరియు కుటుంబ సభ్యులు, రాజం పల్లి గ్రామ టిడిపి నాయకులు, నియోజకవర్గంలోని వివిద హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# మక్తల్‌లో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ ఆవిష్కరణకు ఆర్థికంగా హార్దికంగా సహకరించిన మక్తల్ వ్యాపారస్థులు, ప్రజానీకానికి ధన్యవాదములు : ఎం కిష్టారెడ్డి






**నారాయణపేట జిల్లా, (రాజధాని వార్తలు):** సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు (భగత్ సింగ్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షులు) మక్తల్ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ విగ్రహానికి మక్తల్ ప్రజానీకం ఆర్థికంగా హార్థిక సహకరించిన వారందరికీ పిడిఎస్యు, పి వై ఎల్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ భగత్‌సింగ్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి ధన్యవాదాలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా సి పి ఐ ఎం ఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు (భగత్ సింగ్ విగ్రహ ప్రతిష్టపన కమిటీ) ఎం కిష్టారెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం తన ప్రాణాలను రుణ ప్రయాణం కల్పించిన భగత్ సింగ్‌లాంటి యువ కిశోరాలను బ్రిటిష్ వాళ్ళు ఉరి తీయడం జరిగింది. భగత్ సింగ్‌లాంటి వాళ్ళని నేను యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. నేటి యువత చెడు వ్యసనలను బానిసలుగా కాకుండా జాతీయ అమరవీరుల స్ఫూర్తిని తీసుకోవాలని అన్ని అన్నారు. నేడు దేశ, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల యొక్క సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేసి ఒక్కరిమీద ఒక్కరు మాట్లాడుకుంటూ కాలయాపన చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదని అన్నారు విద్యార్థులు, యువకులు, ప్రజలు ఎప్పటికప్పుడు రాజకీయ నాయకులు చేసే తప్పుడు ప్రచారాలను నమ్మకుండా ఉండాలని అన్నారు. నేటి పరిస్థితులలో భగత్ సింగ్‌లాంటి యువకిశోరాల త్యాగంను ఆదర్శంగా తీసుకోవాలని అందులో భాగంగా నే మక్తల్ పట్టణ కేంద్రంలో భగత్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేసుకోవడం దానికి ప్రజల ఆదరణ చూపడం చూపించడం చాలా సంతోషకరమైన విషయం మక్తల్‌లో ఆర్థికంగా హార్థికంగా సహకరించిన వ్యాపారస్థులకి, సానుభూతిపారులకి, ప్రజలకి ధన్యవాదములు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సి పి ఐ ఎం ఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి సలీమ్, TUCI జిల్లా అధ్యక్షులు కిరణ్ AIUKS జిల్లా అధ్యక్షులు (భగత్ సింగ్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ కార్యదర్శి) భగవంతు పి డీ ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.భాస్కర్, పి వో డబ్లు జిల్లా అధ్యక్షురాలు శారద, AIUKS జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, పాతపల్లిమాజీ సర్పంచ్ కృష్ణయ్య, నాయకులు రాజు, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

# విత్తన కొనుగోలులో తీయాల్సిన జాగ్రత్తలపై అవగాహన

**జమ్మికుంట, (రాజధాని వార్తలు):** జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ రైతు వేదిక పరిధిలో రాబోవు వానాకాలం సీజన్‌కి సంబం ధించి రైతులు పత్తి మరియు వరి విత్తనాలు కొనుగోలు సమ యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ రైతులకు అవగాహన కల్పించారు.

1) రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో తప్పనిసరిగా లైసెన్స్ కలిగిన డీలర్ల దగ్గర్నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని సూచించడం జరిగింది. 2) కొనుగోలు చేసిన ప్రతి విత్తనం ప్యాకెట్‌కు తప్పనిసరి రసీదు తీసుకోవాలి, Lot No వివరాలు ఉన్నా రసీదును పొందవలసిందిగా తెలియజేయడం జరిగింది. 3)అనధికారిక వ్యక్తుల నుంచి ఎలాంటి విత్తనాలు కొనుగోలు చేయరాదని తెలియజేయడం జరిగింది. 4) ఎట్టి పరిస్థితుల్లో లూస్ పత్తి విత్తనాలు కొనుగోలు చేయరాదు. 5) అన్ని BG II పత్తి విత్తనాల రకాలు దాదాపుగా ఒకే రకమైన దిగుబడి సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని దయచేసి రైతులు కేవలం కొన్ని రకాల



పత్తి విత్తనాలు మాత్రమే అధిక దిగుబడి ఇస్తున్నాయని అపోహ పడి వాటి కోసము బ్లాక్ మార్కెట్లో కొనుగోలు చేయరాదని సూచించడం జరిగింది. 6) పత్తి విత్తనాలు మే నెలలో వర్షాలు పడకముందే పెట్టడం వల్ల ఎండ తీవ్రతకు వాటి యొక్క మొలక సామర్థ్యం దెబ్బతినే అవకాశం ఉంది కాబట్టి సరైన వర్షాలు పడిన తర్వాత మాత్రమే రైతులు పత్తి విత్తనాలు వేసుకోవాలని తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్, వ్యవసాయ విస్తరణ అధికారి మహేందర్ మరియు రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా కీ.శే. జి.జయంతి కుమార్ సంతాప సభ - నివాళులర్పించిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**వైదేహి నగర్ ఎల్బీనగర్, (రాజధాని వార్తలు):** వైదేహి నగర్ సీనియర్ సిటి జన్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనములో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కీ.శే. జయంతి కుమార్ సంతాప సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి విచ్చేసి జయంత్ కుమార్ చిత్రపటానికి పువ్వులు వేసి ఘనంగా నివాళులు అర్పించి ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జయంత్ గొప్ప వ్యక్తి ఆయన మరణం చాలా బాధాకరమైన విషయమని ఆయన మన మధ్యన లేకపోవడం విచారకరం వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతుని ప్రార్థించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో కాలనీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి.సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ మల్లేశం, వైస్ ప్రెసి డెంట్ భాస్కర్, జాయింట్ సెక్రెటరీ యాదగిరి రెడ్డి, కోశాధికారి జయరామ శర్మ, కోఆర్డినేటర్ సెక్రెటరీ డాక్టర్ ఎస్ రాజ గోపాల్ మరియు పార్టీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సురేష్ కుమార్ కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలి

**- మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్చలు జరపాలి - కర్రే గుట్టల ప్రాంతాల్లో ఉన్న సాయుధ బలగాలను యుద్ధ ప్రాతిపదికన ఉపసంహరించాలి - ఆదివాసీలపై హత్యాకాండ దాడులను నిలిపి వేయాలి**

**ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల బ్యూరో, (రాజధాని వార్తలు):** మావోయి స్టులతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్చలు జరపాలి, కర్రే గుట్టల ప్రాంతాల్లో ఉన్న సాయుధ బలగాలను యుద్ధ ప్రాతి పదికన ఉపసంహరించాలి, ఆదివాసీలపై హత్యాకాండ దాడులను నిలిపి వేయాలి వామపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంలో బి విజయ సారథి గుణగంటి రాజన్న సనప పొమ్మయ్య నందగిరి వెంకటేశ్వర్లు బుర్ర ఆనంద్ కొత్తపల్లి రవి కంచ వెంకన్నలు డిమాండ్, నేడు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆఫీస్ వీరభవన్‌లో సిపిఐ సిపిఎం సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ సిపిఐ ఎమ్మెల్యే న్యూడెమోక్రసీ సిపిఐ ఎంఎల్ ఎం సిపిఐయుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గుణగంటి రాజన్న సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పెద్ద చంద్రన్న వర్గం జిల్లా కార్యదర్శిసనప పొమ్మయ్య సిపిఐ ఎమ్మెల్ న్యూడెమోక్రసీ వైకె వర్గం నందగిరి వెంకటేశ్వర్లు సిపిఐ ఎంఎల్ బుర్ర ఆనంద్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కొత్తపల్లి రవి ఎం సి పి ఐ యు కంచ వెంకన్నలు మాటాడుతూ మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం మావోయిస్టులను అణిచి వేస్తామని పేరుతో ఆపరేషన్ కగార్ పేరిట దేశంలో మరణ హోమం చేస్తుందని హెచ్చరించారు




ఆదివాసీలు నివసిస్తున్న ప్రాంతాల్లో దాడులు నిర్వహించి అక్కడ ఉన్న ఖనిజ సంపద కార్పోరేట్ వారికి అప్పజెప్పడానికి ఆపరేషన్ కగార్ పేరిట మారణ హోమం సృష్టిస్తుందని పేర్కొన్నారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం వెంటనే శాంతి చర్చలు జరపాలని పిలుపునిచ్చారు కర్రిగుట్టల ప్రాంతాల్లో మొహరించిన సాయుధ బలగాలను వెంటనే ఉపసంహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో మే 9న జిల్లా కేంద్రంలో ర్యాలీ సభ నిర్వహి స్తున్నట్టు తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి అజయ్ సారధి రెడ్డి, సమ్మెట రాజ మౌళి భాస్కర్ రెడ్డి రామ్మోహన్ పెరుగు కుమార్ దుడ్డేల రామ్మూర్తి దేశ పల్లి నవీన్ బండపల్లి వెంకటేశ్వర్లు బిక్షపతి చింతకుంట్ల వెంకన్న కట్లోజు పాండురంగాచారి వరిపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద ప్లానింగ్‌లోనే ఉన్న సమంత..!



స్టార్ హీరోయిన్ సమంత కొత్తగా నిర్మాత అవతారమెత్తిన విషయం తెలిసిందే. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అంటూ సమంత సొంత నిర్మాణ సంస్థతో కొత్త జర్నీ మొదలు పెట్టింది. నిర్మాతగా సమంత అప్రోచ్ ఎలా ఉంటుంది అనుకున్న ఆడియన్స్‌కి తన తొలి సినిమా శుభం టీజర్‌తోనే సర్‌ప్రైజ్ చేసింది. అంతా యువ నటీనటులతో సమంత ఈ ప్రయత్నం చేసింది. ఈ సినిమాను ప్రవీణ్ కండ్రేగుల డైరెక్ట్ చేశారు. సమంతలాంటి స్టార్ హీరోయిన్ మొదటి ప్రొడక్షన్ కోసం అతన్ని తీసుకోవడం లక్కీ అని చెప్పొచ్చు. ఐతే సమంత ఏదో సరదాగా ఈ ప్రొడక్షన్‌ని మొదలు పెట్టినట్టు లేదు. శుభంతో మొదలు పెట్టిన సమంత తన ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌లో సరికొత్త ప్రయోగాలతో ముఖ్యంగా కొత్త వారితోనే సినిమాలు చేసే ప్లానింగ్‌లో ఉన్నట్టు తెలుస్తుంది. సమంత ఓ పక్క హీరోయిన్‌గా నటిస్తూనే మరోపక్క తన ప్రొడక్షన్‌లో సినిమాలు చేయాలని ఫిక్స్ అయ్యింది.

ఐతే సమంత బ్యానర్‌కి ఒక స్పెషాలిటీ ఉండేలా కొత్త కథలు సరికొత్త కథనాలతో రాబో తున్నట్టు తెలుస్తుంది. దానికి మొదటి అడుగుగా శుభం సినిమా వస్తుంది. శుభం సినిమాలో సమంత క్యామియో కూడా ఆడియన్స్‌ని సర్ ప్రైజ్ చేస్తుందని తెలుస్తుంది. తన ప్రొడక్షన్‌లో వచ్చే సినిమాలు ఇటు ఫన్‌తో పాటు ప్రయోగాత్మకంగా ఉం డేలా చూస్తుందట సమంత. శుభం సక్సెస్ అయితే ఏమాత్రం లేట్ చేయకుండా సమంత మరో కొత్త ప్రాజెక్ట్‌ని లైన్‌లో పెట్టాలని చూస్తుంది. ఇక హీరోయిన్‌గా సమంత బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్ట్‌లు చేస్తుంది. తెలుగులో ఆమెకు అవకాశాలు రావట్లేదా లేదా ఆమె కావాలని చేయట్లేదా అన్నది తెలియదు కానీ సమంత మాత్రం ఇకమీదట అటు నటిగా ఇటు నిర్మాతగా డ్యుయల్ రోల్‌లో మెప్పించాలని చూస్తుంది. ఐతే నిర్మాతగా తను కొనసాగాలంటే మాత్రం ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ కూడా అవసరం ఉంటుంది. సమంత చిన్న సినిమాతో మొదలైన తన ప్రొడక్షన్ పెద్ద స్థాయిలో సినిమాలు చేయాలంటే తప్పనిసరిగా ఆమె చేస్తున్న ప్రయత్నాలు సక్సెస్ అవ్వాలి. ఎలాగు ఆమె ఫ్యాన్స్ సపోర్ట్‌గా ఉంటారు ఆడియన్స్ కూడా సమంత ప్రయత్నాలు ఎంకరేజ్ చేస్తే మాత్రం అనుకున్నట్టుగానే ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ సక్సెస్ అయ్యే ఛాన్స్ ఉంటుంది.

# ఈగో కూడా మంచిదే.. కానీ



డైరెక్టర్ పూరీ జగన్నాథ్‌కు స్పెషల్ ఫ్యాన్స్ ఉంటారు. ఏ విషయంపై అయినా తన అభిప్రాయాన్ని సూటిగా చెప్తూ ఉంటాడు పూరీ. కరోనా టైమ్ నుంచి పూరీ మ్యూజింగ్స్ పేరుతో యూట్యూబ్‌లో పలు అంశాలపై మాట్లాడుతూ ఆడియన్స్ ను ఆకట్టుకుంటున్నాడు పూరీ జగన్నాథ్. తన సినిమాలతో ఎలాగైతే ప్రేక్షకుల్ని మెప్పించాడో దీంతో కూడా అలానే యూత్‌ను ఎట్రాక్ట్ చేస్తున్నాడు పూరీ. పూరీ మ్యూజింగ్స్‌కి కూడా ఓ సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. ఆయన ఏ టాపిక్ మీద మాట్లాడినా ఎంతోమంది ఫాలోవర్లు దాన్ని వినడానికి ఆసక్తిగా ఉంటారు. రీసెంట్‌గా పూరీ ఈగో అనే విషయంపై మాట్లాడాడు. ఈగో మంచిదేనని, అది మన సెల్ఫ్ రెస్పెక్ట్ ను కాపాడుతుందని, కాకపోతే ఈగో విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పూరీ జగన్నాథ్ అంటున్నాడు. అందరం నా బ్రెయిన్‌లో ఉన్నది నేనే కదా అనుకుంటారని, కానీ కాదని, మన లోపల ఇంకొకడుం టాడని వాడి పేరే ఈగో అని, ఇది మొత్తం రన్ చేసేది వాడేనని, ఓవర్ థింకింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వాడే సీఈఓ అని, ఎవరైనా నీ మీద జోక్ వేస్తే వాడు అనవసరంగా హర్ట్ అవుతాడని, ఎక్కడ లేని కోపమొస్తుందని, కోపంలో వాడోదో డెసిషన్ తీసుకుంటాడని పూరీ చెప్పాడు. ప్రతిక్షణం అవతల వారితో ఎలా డిస్కషన్‌కు దిగాలి? అందులో మనమే గెలవాలంటే ఏం మాట్లాడాలనే విషయంపై ప్రతీక్షణం ట్రైనింగ్ ఇస్తుంటాడని, ప్రతీ దానికి లోపలి వాడికి కోపం వస్తుంటుందని, వాడెవడు మన కారుని ఓవర్‌టేక్ చేశాడు? మనకి ముందు చెప్పాలి కదా, మనకు ముందు పెట్టకుండా వేరే వాళ్లకు ముందు వడ్డిస్తున్నారేంటి ఇలా ప్రతీ విషయానికి లోపలి వాడు రియాక్ట్ అవుతూ ఉంటాడని పూరీ చెప్పుకొచ్చాడు. ఈగో వల్ల ఎన్నో గొడవలవుతాయని, అలా అని మన ఈగోని తీసేయలేమని, వాడు మన తోడబుట్టిన తమ్ముడులాంటి వాడని, మనతోనే ఉంటాడని, కొంచెం లోతుగా ఆలోచిస్తే ఈ ఈగో బ్రదర్ మంచివాడేనని, మన ఆత్మాభిమానాన్ని కాపాడుతూ, మనం ఎవరి ముందు తలవంచకూడదని, తగ్గకూడదని కోరుకుంటూ ఉంటాడని, కాకపోతే వాడి వల్ల మనల్ని ఎంతో ఇష్టపడే వాళ్లు కూడా బాధ పడతారని, ఫ్యామిలీలోని వాళ్లు, తల్లిదండ్రుల్ని కూడా ఈ ఈగో దూరం చేస్తుందని అందుకే ఈగోని దాచమని చెప్తున్నాడు పూరీ. ఈగోని దాచడం ఒక ఆర్ట్ అని, దాన్ని దాయగలిగితే సగం గొడవలు తగ్గుతాయని, ఎదుటివారితో మాట్లాడేటప్పుడు మీ ఇగోతో కాకుండా మీరే మాట్లాడండని, వాడిని మాట్లాడనివ్వకండని పూరీ జగన్నాథ్ తెలిపాడు.

# చిరంజీవి సినిమాలో దీపిక పదుకొణే!



మెగాస్టార్ చిరంజీవి 158వ చిత్రం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇది పీరియాడిక్ భారీ యాక్షన్ థ్రిల్లర్. మూడు దశాబ్దాల క్రితం చిరంజీవి నట విశ్వరూపం మళ్లీ ఈ సినిమాలో కనిపించబోతుంది అన్న అంచనాలున్నాయి. ఈ పాత్రకు సంబంధించి చిరంజీవి ప్రత్యేక కసరత్తులు చేయాల్సి ఉంది. అనీల్ రావిపూడితో చేస్తోన్న 157వ సినిమా తర్వాత చిరంజీవి 158 పనుల్లో నిమగ్నమవుతారు. అయితే ఈ సినిమాలో హీరోయిన్ విషయంలో ఇప్పటికే రకరకాల ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్ నటి రాణీ ముఖర్జీ పేరు తెరపైకి వచ్చింది. చిరు వయసుకు రాణీ పర్ఫెక్ట్‌గా సూటవుతుందని భావిస్తున్నట్లు ప్రచారం సాగింది. అయితే రాణీ ముఖర్జీ కంటే ఆ పాత్రకు బాలీవుడ్ సంచలనం దీపికా పదుకొణే అయితే బాగుంటుందనే కొత్త ప్రపోజల్ తెరపైకి వస్తుంది. దీపిక అయితే పాన్ ఇండియాలో ఎంతో ఫేమస్. కల్కి 2898తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. అన్నింటిని మంచి సౌత్‌లోనూ ఫాలోయింగ్ ఉన్న నటి దీపిక. ఈ నేపథ్యంలో మేకర్స్ దీపికను అప్రోచ్ అవ్వాలను కుంటున్నారుట. సినిమాలో సెకెండ్ లీడ్ కూడా ఉందంటున్నారు. ఆ పాత్రకు రాణీ ముఖర్జీని పరిశీలించే అవకాశం ఉందంటున్నారు. మెగాస్టార్‌లాంటి లెజెండ్‌తో కలిసి పనిచేయాలని ప్రతీ నటి కోరుకుంటుంది. అయితే వయసు రీత్యా కొన్ని అడ్డం కులు కూడా ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో సీనియర్ హీరోలకు హీరోయిన్లు సెట్ అవ్వడం అన్నది అంత తేలిగ్గా జరగలేదు. ప్రస్తుతం 157వ సినిమా హీరోయిన్ విషయంలోనూ ఇదే తర్జన భర్జన కొనసాగుతుంది. నయనతారను అడిగితే ఆమె భారీగా పారితోషికం డిమాండ్ చేస్తోంది. దీంతో మేకర్స్ వెనక్కి తగ్గాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. కాజల్, తమన్నాలాంటి వాళ్లను తీసుకున్నా? వాళ్లు అంతగా కలిసిరారు.

# రాజా సాబ్‌లో డామినేషన్ ఎవరిది..?





రెబల్ స్టార్ ప్రభాస్ మారుతి కాంబినేషన్ లో వస్తున్న క్రేజీ మూవీ రాజా సాబ్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ సినిమా థ్రిల్లర్ జోనర్‌లో వస్తుంది. ఈ సినిమాకు థమన్ మ్యూజిక్ అందిస్తుండగా నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఐతే ఈ ఇద్దరు హీరోయిన్స్‌లో ఎవరు మెయిన్ అన్నది తెలియాల్సి ఉంది. ముందు అసలు ఈ ప్రాజెక్ట్‌లో మాళవిక ఒక్కతే నటిస్తుందని అనుకున్నారు కానీ ఆ తర్వాత నిధి అగర్వాల్ కూడా వచ్చింది. నిధి అగర్వాల్ కూడా చాలా సెలెక్టెడ్‌గా సినిమాలు చేస్తుంది. ఓ పక్క పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తో హరి హర వీరమల్లు సినిమా చేస్తున్న నిధి రాజా సాబ్‌లో కూడా నటిస్తుంది. ఐతే రాజా సాబ్ సినిమాలో మాళవిక కూడా అదరగొట్టనుందని తెలుస్తుంది. ఈ సినిమాతో అమ్మడు టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుంది. మాళవిక గ్లామర్‌కి ఈ పాటికే స్టార్ రేంజ్‌కి వెళ్లాలి కానీ అమ్మడికి లక్ కలిసి రావట్లేదు. రాజా సాబ్ సినిమాలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ ఇద్దరు నటిస్తున్నారు. ఐతే ఈ ఇద్దరిలో ఎవరి డామినేషన్ ఎక్కువగా ఉంటుంది అన్నది ఇంట్రెస్టింగ్‌గా ఉంది. నిధి, మాళవిక ఇద్దరు మంచి హీరోయిన్సే.. ఐతే సినిమాలో ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. రాజా సాబ్‌లో ఇద్దరిలో ఎవరు ఎవరిని డామినేట్ చేస్తారన్నది చూడాలి. ఇక సినిమా ప్రమోషన్స్ విషయానికి వస్తే త్వరలో టీజర్‌ని రిలీజ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. రాజా సాబ్ సినిమా విషయంలో మారుతి చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాడు. మర్ ఈ సినిమా విషయంలో రెబల్ ఫ్యాన్స్ లెక్కలు నిజం అవుతాయా లేదా అన్నది చూడాలి. అసలైతే ఈ ఇయర్ సమ్మర్ లో రిలీజ్ అవ్వాల్సిన రాజా సాబ్ వాయిదా పడుతూ వస్తుంది. సినిమాను దసరా బరిలో దించే ప్లానింగ్‌లో ఉన్నారని టాక్. ఐతే అఫీషియల్‌గా మేకర్స్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అప్డేట్ రాలేదు. రాజా సాబ్ అవుట్ పుట్ గురించి ప్రభాస్ కూడా సాటిస్ఫైడ్‌గా ఉన్నాడని టాక్. ఇండియన్ స్క్రీన్ మీద రాజా సాబ్ ఒక కొత్త ప్రయోగం అని అంటున్నారు. మరి అది ఏమేరకు ప్రేక్షకులను అలరిస్తుంది అన్నది చూడాలి.

# గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## - జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి అధికారులను ఆదేశించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టంపై జిల్లా స్థాయి కమిటి సమావేశం కలెక్టరేట్ లోనిన తన ఛాంబర్ లో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం 1994 ను కఠినంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లా లో ప్రస్తుతం లింగనిష్పత్తి 1000మంది బాలురు, 972 బాలికలుగా ఉందని, లింగ నిష్పత్తి సమానంగా ఉండేందుకు చర్యలు చేపట్టాలని. లింగ నిష్పత్తి మండలాల వారీగా సమీక్షిస్తూ తక్కువగా ఉన్న మండలాల సిడిపివోలు మరింత సమర్ధవంతమైన పర్యవేక్షణ చేయాలని సూచించారు. బాలికలను కాపాడుకోవాలని, వారిపై వివక్ష చూపకూడదని తెలిపారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నేరమన్నారు. ఏ లేబరేటరీగాని, స్కానింగ్ కేంద్రం గాని





గర్భస్థ పిండం లింగాన్ని తెలిపే ఉద్దేశ్యంతో చేయరాదని, చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, పదివేల రూపాయిల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడశిశువు అని తెలిసి గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబరుకు లేదా ఆన్లైన్ గ్రీవియన్స్ ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు. ఆడపిల్ల విలువ కట్టలేనిదని ఆడపిల్ల రక్షణ బాధ్యత మనదే అని అన్నారు. ఏఎన్ఎమ్, ఆశాలు గృహ సందర్శనాల ద్వారా ఆడపిల్లల సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. నూతన వధూవరులకు, గర్భవతిక, అత్త మామలకు దీనిపై అవగాహన కల్పించాలని డిఆర్ఓ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శాంతి ప్రభ మాట్లాడుతూ జిల్లాలో 73 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కొత్తగా 03 కేంద్రాలు గుర్తింపు కొరకు, రెండు కేంద్రాలు రెన్యువల్ కొరకు, ఒక కేంద్రం మోడిఫికేషన్ కొరకు ధరఖాస్తులు వచ్చాయన్నారు.

స్కానింగు కేంద్రాలను మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. డెకాయ్ ఆపరే షన్ కూడా చేపడుతున్నట్లు తెలిపారు. బాలికలు సంరక్షణపై ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ మోహన్ రావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనంతలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్వోలు బాలాజీ, కె.వి.జ్యోతి, డి ఐ ఓ, ఇతర కమిటీ సభ్యులు హాజరయ్యారు.

# ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలి : జిల్లా రెవిన్యూ అధికారి వై,సత్యనారాయణ రావు





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఇంటర్మీడియెట్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో పక్కాగా ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలలో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్ధులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ప్రజా రవాణాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో వేసవికాలం దృష్ట్యా పరిశుభ్రమైన తాగునీరు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ, పంచాయతీ అధికారులను ఆదేశించారు. అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను డిఆర్ఓ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలని, పరీక్షా కేంద్రాలకు దగ్గరలోని జెరాక్స్ సెంటర్లను పరీక్షల సమయంలో మూసివే యాలని, పరీక్షా పత్రాలకు, తనిఖీ బృందాలకు ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు తెలిపారు. పరీక్షల నిర్వహణ తనిఖీ చేయుటలో సిట్టింగు, ఫ్లయింగు స్క్వాడ్లు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు, పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాల బండిల్స్ సకాలంలో పంపించుటకు పరీక్షల నిర్వహణ అధికారులకు తపాలా శాఖ సిబ్బంది సహకరించాలని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఆయా శాఖలకు కేటాయించిన పనులను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలను సమర్దవంతంగా నిర్వహించాలని కోరారు. జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషను అధికారి బి.సుజాత ఇంటర్మీడియెట్ పరీక్షల వివరాలు తెలియజేస్తూ 12.05.2025 నుండి 19.05.2025 వరకు ఉదయం 9.00 గంటల నుండి 12.00 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5:30 గంటల వరకు రెండవ సంవత్సరం విద్యార్ధులకు పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. జిల్లాలో మొదటి సంవత్సరం 9,323 మంది, రెండో సంవత్సరం 4,414 మంది వెరసి మొత్తం 13,737 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారని అన్నారు. జిల్లాలో 27 సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని విద్యార్థులు పరీక్షా సమయానికి ఒక గంట ముందుగా చేరుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రాలలోనికి సెల్ ఫోనులు నిషేదమని, విద్యార్థులతో పాటు, సిబ్బంది ఎవరూ పరీక్షా కేంద్రంలోనికి తీసురాకూడదని తెలియజేశారు. పరీక్షల నిర్వహణ తనిఖీ చేయుటకు 2 ఫ్లయింగ్ స్కాడ్లను 2 సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి శాంతిప్రభ, ఆర్.టి.సి. అసిస్టెంట్ డిపోమేనేజరు రవిచంద్ర మరియు ఏపీఈపీడీసీఎల్, ట్రెజరీ, జీవీఎంసీ, పంచాయతీ, పోస్టల్ శాఖల అధికారులు హాజరైనారు.

# ఎన్టీఆర్ జన్మదినోత్సవాన్ని "తెలుగు జాతి ఆత్మగౌరవం దినోత్సవం" దినంగా నిర్వహించాలి

## - భావితరాలకు ఎన్టీఆర్‌ని ఒక స్పూర్తిగా చేయగలరని ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుగు శక్తి విజ్ఞప్తి


## - శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ వినతి

**నర్సీపట్నం, (రాజధాని వార్తలు):** "సమాజమే దేవాలయం – ప్రజలే నా దేవుళ్ళు" అని నినదించి, అట్టడుగు, బడుగు బలహీన వర్గాల ప్రజలు సంక్షేమానికి అనేక పథకాలు అమలుచేసి, స్వచ్ఛమైన, సమర్థవంతమైన పాలనతో తెలుగు జాతి గౌరవాన్ని ప్రపంచం నలుమూలలా వ్యాప్తి చేసిన మహానుభావుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు స్వర్గీయ డా? నందమూరి తారక రామారావు అని మంగళవారం మధ్యాహ్నం శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడును కలిసి తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ వినతి పత్రం సమర్పించారు. ఎన్టీఆర్ ఆత్మగౌరవం దినోత్సవంపై చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ను ఈ సందర్భంగా రామ్ కోరారు. ఇప్పటికే గిడుగు వెంకట రామమూర్తి, పింగళి వెంకయ్య, అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు, గౌతు లచ్చన్న తదితరులకు ప్రభుత్వ కార్యక్రమంగా చేస్తున్నారని బి.వి.రామ్ తెలిపారు. శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ తప్పకుండా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో రామ్ మాట్లాడుతూ తెలుగువారిని మద్రాసీలుగానో, దక్షిణాదివారిగానో వ్యవహరిస్తూ, అప్పటి కేంద్ర పాలకులు ప్రజాభిప్రయానికి విరుద్ధంగా ఇష్టానుసారంగా వ్యవస్థను అస్తవ్యస్తం చేసిన సందర్భంలో తెలుగు ప్రజలను చైతన్యపరిచి, తెలుగుదేశం పార్టీ స్థాపించి, కేవలం 9 నెలల వ్యవధిలోనే అఖండ విజయం సాధించి, తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేసి, ప్రజారంజకమైన పాలన అందించి, ప్రజలు ముఖ్యమంత్రిగానే కాకుండా, భారతదేశ రాజకీయ యవనికపై ఏక పార్టీ పెత్తనానికి చెల్లుచీటు పాడి ప్రాంతీయ శక్తులతో సంకీర్ణ రాజకీయ వ్యవస్థకు నాంది పలికి "నేషనల్ ఫ్రంట్" స్థాపనతో దేశ రాజకీయ దిశానిర్దేశాన్ని మార్చి, చరిత్రలో నిలిచిపోయిన మహానుభావుడు స్వర్గీయ డా.ఎన్టీఆర్ గారేనన్న విషయం సవినయంగా మనవి చేసుకుంటున్నాను. తెలుగ జాతికి, తెలుగు భాష, సంస్కృతులు అభివృద్ధికి పెద్దపీటవేస్తూ ప్రత్యేక తెలుగు విశ్వవిద్యాలయం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాలు ఏర్పాటుతోబాటు, హైదరాబాద్‌లోని ట్యాంక్బండ్‌పై తెలుగు జాతికి గర్వకారణమైన ఎందరో మహానుభావుల విగ్రహాలు స్థాపన, హుస్సేన్ సాగర్‌లో అతి పెద్ద బుద్ధుని విగ్రహం ఏర్పాటు చేసి, బుద్ధిపూర్ణిమ ప్రోజెక్టులతో పాటు "తెలుగ గ్రామీణ క్రాంతిపథం" వంటి అనేక సంక్షేమ పథకాలకు తెలుగు పేర్లు వాడకం, అధికార భాషగా తెలుగు వినియోగానికి అత్యంత ప్రాచుర్యాన్ని కల్పించడం, మండల వ్యవస్థను ప్రవేశపెట్టి, సామాన్యుని ముంగిటకు ప్రభుత్వ సేవలను తీసుకొచ్చిన మహానుభావుడు డా.స్వర్గీయ ఎన్టీఆర్ అని



అన్నారు. అటువంటి మహా వ్యక్తి జన్మదినమైన మే 28వ తేదీ తెలుగు ప్రజలు అందరూ గుర్తించుకొనే విధముగా "తెలుగు జాతి ఆత్మగౌరవం దినోత్సవం"గా జరుపుకోవటం ద్వారా ఆ మహానుభావునికి నిజమైన నివాళిగా అని తెలియజేసుకుంటున్నాను. ప్రభుత్వ కార్యక్రమంగా ప్రకటించడం వలన ఆరోజు అన్ని ప్రభుత్వ శాఖలు, కార్యాలయాలలో ఉద్యోగులు అందరూ ఆ మహానుభావుని స్మరించుకుంటూ, ఒక వేడుకగా నిర్వహించుకొనే అవకాశం కలుగుతుంది. ఆయన జీవిత విశేషాలు, సామాన్య ప్రజల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి పాలనా పరమైన సంస్కరణలు, ప్రజలను ప్రభావితం చేసే వ్యక్తిగత క్రమశిక్షణా అలవాట్లతో పాటు, తెలుగు చలన చిత్ర రంగంలో జనరంజకమైన అనేక జానపద, పౌరాణిక, సాంఘిక చిత్రాలతో విషిష్టమైన పాత్రలు పోషించిన నటుడుగా, దర్శకుడుగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా, తెలుగు జాతి ఖ్యాతిని ఖండ, ఖండాంతరాలకు వ్యాపింపజేసిన గొప్ప వ్యక్తికి మహానివాళిగా భావించవచ్చు అని అన్నారు. ఎన్టీఆర్ మధుర స్మృతులు అందరూ గుర్తించుకొనే విధముగా వివిధ సాంస్కృతిక అంశాలతో సదస్సులు తదితర కార్యక్రమాల నిర్వహణకు వీలు కలుగుతుంది, ఎప్పుడూ పరిపాలన విధుల్లో తలమానుకలయ్యే అధికారులు, ఉద్యోగులు కూడా ఆ మహానుభావునికి నివాళి అర్పించే విధంగా అవకాశం కలుగుతుంది. అలాగే భావితరాలకు ఎన్టీఆర్‌ని ఒక స్పూర్తిగా చేయగలరని ప్రభుత్వానికి మనవి చేసుకుంటున్నాను. ఈరోజు అన్ని రాజకీయ పార్టీలు ఎవరు కూడా అభ్యంతరం చెప్పరని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకి తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాను. శాసనసభ సభాపతి కలిసిన వారిలో ఎం.ఎస్.నాయుడు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా కార్యదర్శి, వి.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగేళ్లుగా నిష్క్రియంగా బీఎస్ఎన్ఎల్ టవర్లు - గ్రామస్తుల గళం



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** చింతపల్లి మండలం లోని పలు గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు నిష్క్రియంగా మిగిలిపోవడంతో వినియోగదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంతో పాటు కొమ్మంగి, కృష్ణాపురం తదితర గ్రామాల్లో నాలుగు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన టవర్లు ప్రారంభమైన కొద్ది సమయంలోనే సేవల్ని నిలిపివేశాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో లోపాలు, టెక్నికల్ సమస్యల కారణంగా టవర్ల నిర్వహణ లోపించడంతో, బీఎస్ఎన్ఎల్ సేవలు అనవసరంగా నిలిచిపోతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జియో వంటి ఇతర నెట్‌వర్కులు అందుబాటులో ఉన్నప్పటికీ, కొందరు వినియోగదారులు ఇప్పటికీ బీఎస్ఎన్ఎల్ పై ఆధారపడుతుండటంతో వారికి మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానికులు సంబంధిత అధికారుల వెంటనే స్పందన కోరుతూ, టవర్లను త్వరితగతిన యథాస్థితికి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్యలపై చర్యలు తీసుకోకపోతే ప్రత్యామ్నాయ మార్గాలపై పునరాలోచన అవసరమవుతుందని హెచ్చరిస్తున్నారు.

# పలు ఆలయాలను దర్శించుకున్న సినీ నటి ఇంద్రజ





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి సినిమా షూటింగ్లో పాల్గొనేందుకు అనకాపల్లి పట్టణాలకు వచ్చిన ప్రముఖ సినీనటి ఇంద్రజ మంగళవారం శతకం పట్టులో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, శ్రీ గౌరీ పరమేశ్వరి ఆలయం, శ్రీ మరిడిమాంబ ఆలయంలో అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. శ్రీ కనకదుర్గ ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాకులు కాండ్రేగుల నాయుడు దంపతులు, ఆలయ అధ్యక్షులు భీమరశెట్టి వర నూకరాజు,శ్రీ గౌరీ పరమేశ్వరుల ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, పొలిమేర శ్రీను, గడేపల్లి మురళి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan